# "గోపీ మామ్మ తప్పిపోయింది"

"తలుపు — తలుపు"

"వస్తే, వస్తే, ఎవరు వారు ?"

"నేనే"

"ఎవరూ?"

"నేనే"

"నేనేనంటే ఎవరండీ?"

"తలుపు తియ్యరా కైలాసం. నేనేనంటే"

"ఒరీ నువ్వట్రా సుందరం. నేనే అంటే ఏం తెలుస్తుంది. రా, లోపలికిరా, ఇప్పుడేం రైలుందిరా?"

"నువ్వే పెట్టెలోపలి పెట్టి చొక్కా తొడుక్కు రారా కైలాసం. చాలా అర్జంటు"

"ఏమిట్రా గుమ్మంలోంచే మాట్లాడుతావేం. ముందు లోపలికిరా?"

"గోపీగాడి మామ్మ తప్పిపోయింది. పోలీసు స్టేషనుకి వెళ్లి రిపోర్టు ఇచ్చిరావాలి. త్వరగా రా, అర్జంటుగా"

"ఏమిట్రా నీ ధోరణి, సుందరం? గోపీ మామ్మ తప్పిపోవడమేమిటి? మధ్య నువ్వు వెళ్లి పోలీసుకి రిపోర్టు ఇవ్వడమేమిటి? నాకేం బోధ పడడంలేదు. ముందిలా రా. పెట్టి ఆ బల్లమీద పెట్టి అలా కుర్చీలో కూచో. మరీ అలా ఖంగా రైపోతున్నావేమిట్రా. ఏమిటో అసలు సంగతి చెప్పు"

"ఒరేయ్ కైలాసం, అసలు సంగతి చెప్తా విన్నా. ముందు మంచినీళ్లు ఇయ్యి"

"ఇదిగో కూజాలో నీళ్లు"

"అమ్మయ్య. ఇప్పుడు విన్నా. ఇప్పుడు వచ్చి చావు వచ్చిపడిందిరా"

"ఏమిట్రా అలా మాట్లాడతావు?"

"వుండు విన్నా. చెప్పనియ్యవేం."

"ఏమిట్రా మరీ అలా ఇదైపోతున్నావు. చెప్పు నింపాదిగా మొదటినుంచీ"

"విను మరీ. కాలేజీకి శలవు లిచ్చారు కదా. ఆ పూల్లో నువ్వున్నావుకదా ఒక కేంప్ వేద్దాం ఇక్కడికి వచ్చి అనుకున్నా. దాంతో నా కష్టాలు ప్రారంభం అయ్యాయిరా"

"కష్టాలేమిట్రా ? నాకేం అర్థం కావడం లేదు"

"అబ్బ వినరా బాబూ. మధ్యలో అడ్డురాకు. లేకపోతే, నేను చెప్తోంది కాస్తా మర్చిపోతాను"

"సరేలే చెప్పు. నీకు చేతైనట్టుగా"

"సరే, నిన్న సాయంత్రం, గోపీగాడు బజార్లో కనబడితే, వాడితో యుదాలాభంగా, నేనిలా బెజవాడ వెడుతున్నాన్రా అన్నాను.

"వూ"

"అప్పుడు వాడన్నాడు కదా, ఒరేయ్ చంటీ, "చంటీ......"

"చంటి ఎవరు ?"

"నేను"

"నువ్వు చంటివా?"

"ఒరేయ్ నన్నేడిపించకు. నన్ను ఇంట్లో అంతా చంటీ అని పిలుస్తారు"

"కలికాలం బాబూ. పాతికేసి ఏళ్లవాళ్ల కూడా, చంటీ అని పిలవబడడం, సరేలే తర్వాత చెప్పు"

"గోపీగాడు, ఒరేయ్, చంటీ, చంటీ, ఒక వుపకారం చేసిపెట్టాలిరా అంటూ తగులు కున్నాడు"

"ఏమిటి?"

"అబ్బ తొందర చెయ్యకురా. చెప్పనీ. గోపీ గాడు అన్నాడుకదా ఒరే ఒరే నువ్వెలాగా బెజవాడ

## బుద్ధిరాజు బాబీ సుశీల

వెడుతున్నావు, మా మామ్మ బెజవాడ కనకదుర్గ కొండకి తీసికెళ్లమని చంపేస్తుంది రేపు శుక్ర వారం కదూ. రేపు కనకదుర్గకి పెద్ద వుత్సవం చేస్తార్ట బెజవాడలో, అది చూడాలంటోంది. అంచేత బాబ్బాయి మా మామ్మని నీతో బెజవాడ తీసికెళ్లి ఆ వుత్సవం చూపించేసి, రాత్రి ఏదో రయిల్లో తిరిగి పంపిచెయ్యరా, అంటూ ఎంతో ఇదయ్యాడు. నేను పోనీలే మనవాడింత ఇదవ్వు తున్నాడు కదా, ఇందులో మనకి పెద్ద శ్రమ ఏముందిలే, స్నేహితుడికి ఒయామాత్రం వుప కారం చెయ్యలేమా ఏమిటి పోదూ అని చెప్పేసి సరేనన్నా"

"వూ"

"సరె ప్రొద్దున్న గోదావరి స్టేషనుకి తీసు కొచ్చాడు రైలుకి, వాళ్ల మామ్మని"

"వూ"

"గోపీగాడు నన్ను వీడు చంటి, నా స్నేహి తుడు అని వాడి మామ్మకి ఇంట్రడ్యూస్ చేసి, రైలెక్కించి జాగ్రత్తగా వెళ్లిరండని చెప్పి సాగనంపేడు"

"వూ"

"బండి లేటయింది. బెజవాడ వచ్చేటప్పటికి నాలుగయింది. నీ తెలివి ఎలావుందీ, ఊపూరు ట్రాన్స్ఫర్ అయిందీ అని వ్రాశావు గా, ఇంటి అడ్రెస్ వ్రాశావు కాదు. స్టేషను నుంచేసి ఆఫీసుకి ఫోనుచేశాను. ఇవ్వాళ ఆఫీసు ఎక్కొట్టే వన్నారు. గవర్నరుపేటలో వుంటున్నావనీ, అడ్రెస్ తెలీదనీ చెప్పారు మీ ఆఫీసువాళ్లు"

"వచ్చి వారమేగా అయింది. ఆఫీసులో ఇంకా నా అడ్రెస్ తెలీదులే, ఇవాళ ఆఫీసుకి వెళ్లలేదు.

ఇంట్లోవాళ్లు బైటుంటం మూలాన్ని"

"ఇల్లు రిపేరీయా"

కాదురా. ఇంట్లోవాళ్ళు బైటున్నారంటే బలే సమయానికి వచ్చావు. వంటా అదీ చూస్కుకుందువుగాని రెండ్రోజులపాటు".

వంటా గింటా ఏం కుదరదులే మరి. సరే విను. నేనిప్పుడేంచేస్తానంటే, సరే గోపీమామ్మని కనకదుర్గ కొండకి తీసుకెళ్ళి ఉత్సవం, పూజా గీజా చూపించేసి మళ్ళీ రైల్లో ఎక్కించేసి అప్పుడు నిబసకనుక్కొని వెడదాంలే అనుకో అని చెప్పేసి ఆవిడని తీసుకొని బయలుదేరాను."

"వూం".

"ఆవిడ దోవలో కృష్ణలో ఓ మునుగు మునిగింది. తర్వాత దుర్గ కొండమీదికి వెళ్లేం అక్కడేం జనం, ఏం జనం చెప్పలేం. ఇసుకేస్తే రాలటం లేదు".

"నువ్వు జనంమీద ఇసుకెందుకు వేశావురా"

"నేను ఇసక వెయ్యడం కాదురా. అంటే అక్కడ బోలెడు చెప్పలేనంత ఎక్కువమంది జనం వున్నారన్నమాట".

"ఒహో అదాసంగతి. కానీ నువ్వు రాలదు కదా అని చెప్పి జనంమీద ఇసక వేసివుష్న ట్టయితే నీ పళ్ళు రాలేవి".

నీపిట్టకి అలో లక్ష్మణా అని సంతో షించాంకాని ఇంక తగ్గ విను. చూశావా, ఎంత వరకూ చెప్పేనో మర్చిపోయాను".

"ఇసకేస్తే రాలటం లేదుదాకా చెప్పేవు".

"ఆఁ. సరే దుర్గ గుళ్ళో హారతీ, గీరతీ, కొబ్బరికాయ, శటగోపం అన్నీ అయింతర్వాత చచ్చిచెడి ఆ జనంలోంచి ఇవతల పడ్డా.

"వూం."

"గోపీగాడిమామ్మ ఆడవాళ్ళ క్యూలో నుంచొని, నేను తొయ్యటంలేదమ్మా బాల, అలా గుడ్లెర్ర చేస్తావేం అని ముందున్న వాళ్ళ తోటి, పడతోస్తారేమిట్రా బుద్ధివుందా లేదా అని వెనకవున్న వాళ్ళతోటీ దెబ్బలాటేసుకొని, గంటసేపటికి ఇవతలకి వచ్చింది".

"వూం."

"కొండమీంచి కిందికి దిగి వచ్చేటప్పటికి చీకటి పడింది. అప్పడికే వూరేగింపు బయలు దేరింది. ఎంతపెద్ద వుత్సవం. ఏం జనం. ఒహో చెప్పడానికి వీల్లేదు."

"వూ".

ఆజనంలో, వూరేగింపులో గోపీమామ్మని నావెనకాలే వుంచుకొని నెమ్మదిగానడుస్తున్నాను.'

"వూ. గొంతుక తగ్గించి చెప్పుకాస్త".

"ఇంతట్లోకి వెనక్కి తిరిగి చూద్దును కదా ఏమాయ మయింది".

"వూరేగింపా?"

"గోపీగాడి మామ్మరా".

"ఎలా మాయమయిందిరా? నీ వెనకాలే వుంచుకొని నడుస్తున్నా నన్నావుకదూ".

"వూఁ. అదేనాకూ ఆశ్చర్యం అవుతుంది. ఎలా మాయ మయ్యిందో అయింది".

"వూఁ".

"అక్కడికీ కొంతదూరం నాచొక్కా వెనకాల పట్టుకొని నడిచింది సుమా".

"మరి మళ్ళీ ఎందుకు విడిచి పెట్టింది?"

"నేనే అలా పట్టుకోవద్దన్నాను. ఎంచేతంటే ఆవిడలా నాచొక్కా వెనకాల పట్టుకొని, నా వెనకాలే నడుస్తోంటే, ఆ జనంలో ఓకుర్రగేంగి మమ్మలి చూసి, కో — జక్ జక్ జనే కో అంటూ నవ్వడం మొదలు పెట్టేరు. మేమిద్దరం ఏదో రైలుబండి ఆడుకొంటున్నా మన్నట్టుగా. నాకు బోలెడు సిగ్గేసి, అలా అలా పట్టు కోవద్దండీ, నావెనకాలే నెమ్మదిగా రండీ అన్నాను".

"వూఁ".

"మరి వెనకాలే రా అంటే రావాలా లేకపోతే మధ్యలో మాయమవడం ఎందుకూఅంటూ నాకు తెలీకడుగుతా"

"ఒరే అరవకురా. ఎవరైనా వింటే నేనేదో తప్పుపని చేస్తే నువ్వు కోప్పడు తూన్నావేమో అనుకుంటారు."

"నిన్ను కోపడ్డం కాదురా. నా కష్టాలు చెప్తున్నాను".

"వూఁ గొంతుక కాస్త తగ్గించి మరీచెప్పు"

"నేనప్పుడు ఖంగారు పడుతూ, మామ్మగారూ, మామ్మగారూ అని అరిచాను ఆజనంలో"

"వూఁ."

"అలా కాస్సేపు అరిచేటప్పటికి నాకు సోలొచ్చింది".

"సోలా".

"అదే శోష. నేనప్పుడో నిమిషం రెస్టు తీసుకొని మళ్ళీ పిలిచా. గారూ వదిలేసి, వుట్టినే మామ్మా, మామ్మా, మామ్మా, మామ్మా, మామ్మా......".

"ఒరేయ్ ఒరేయ్ ఆపరా బాబూ. నాకు అర్థం అయిందిరా. నువ్వు ఏమని పిలిచావోను మామ్మా అని పిలిచావు. సరే. నాకు బోధ పడిందిగా. తర్వాత చెప్పు".

"అప్పుడాజనంలో లెక్క లేనంతమంది ముసలావిళ్ళు ఒయ్ ఇక్కడా, ఇక్కడున్నారా, అంటూ పలికారు కానీ అందులో ఒక్కరూ గోపీగాడి మామ్మ కాదురా అంటే నమ్మరా కైలాసం."

"నమ్మేగా"

"ఆ మైలుపొడుగు తావున జనంలో ఆ చివరినుంచి యీ చివరిదాకా మామ్మా అని అరుస్తూ ఎన్నిసార్లు పరుగెట్టానో చెప్పలేను"

"ఎంచేత?".

"ఎంచేతేమిట్రా ఎవరైనా జనంలో తప్పిపోతే మనం వాళ్లకోసం వెదుకుతూ, లెక్కవేస్తావా ఏమిటి, ఎన్నిసార్లు అటూ ఇటూ పరిగెట్టేనో, ఒకసారీ, రెండుసార్లూ, అనుకుంటూ"

"సరే సరే. తెలిసింది. తర్వాత చెప్పు"

"అలా కాస్సేపు పరిగెట్టి తర్వాత మానేశా"

"ఏం?"

"ఏం ఏమిటి? నీ అడ్డ ప్రశ్నలు మానెయ్. ఆయాసం వచ్చింది. ఇంక పరిగెట్టలేక మానేశాను."

"నీలాంటి స్థూలకాయుడు త్వరగానే ఆయాసపడతాడులే"

"ఒరే ఇది హాస్యానికి టయిము కాదుసైగా నాలావు సంగతి ఎత్తి దిప్పికొట్టకు"

"సరే సరే. తర్వాత ఏంచేశావో చెప్పు"

"ఆ వూరేగింపు క్రమంగా పలచబడి పోయింది. ఆ వెళ్లే జనంలో కనపడ్డ ప్రతీ తలమీద ముసుగున్న ముసలావిడనీ మామ్మా, మామ్మా అని పిలిచాను. ఆ పిలుపు ఎంత జాలిగా వుందంటే నా పిలుపుకి నాకే కళ్లంట నీళ్ళు వచ్చాయ్."

"వూ"

"ఆ ముసలావిడ లందరూ నేనలా పిలుస్తోంటే వెనక్కి తిరిగి, ఎవరో పాపం పిల్లాడు తప్పిపోయినట్టున్నాడు అంటూ నన్ను చూసి జాలిపడడం మొదలు పెట్టారు."

"వూ"

"నా కప్పుడు అభిమానం వేసి ఇంక వెదకడం మానేశా గోపీగాడి మామ్మని. ఇంక ఆవిడ తప్పిపోయినట్టే లెఖ్ఖ అనుకొని ఆశ వదులుకొన్నాను. నీ బస వాకబుచేసి కనుక్కొని ఇలా వచ్చాను. ఇప్పుడు మనం వెళ్లి పోలీసుకి రిపోర్టు ఇచ్చిరావటం ఒక్కటే దారి."

కాని ఒరే ఆవిడా నీకోసంవెదికి, నువ్వు కనపడకపోతే పోన్లేఅనుకొని, స్టేషనుకి వెళ్లిందేమో. రైలెక్కి తిరిగి వెళ్లలేదా?"

తిరిగి వెళ్లకలదుకానీ, ఆవిడ తనదగ్గరున్న డబ్బు నాచేతికిచ్చింది రైల్లోవచ్చేటప్పుడు"

"వూ"

ఒకమూడు రూపాయలు నాదగ్గర జాగ్రత్త చెయ్యమని. దానికోసమే లెక్కజాగ్రత్తబాబూ, లెక్క జాగ్రత్తనాయనా అని తొంభయ్‌సార్లు చెప్పింది. ఇంతటి బోడిలెక్క తనదగ్గరే వుంచేసుకున్నా బాగుండిపోను. పోన్లే రైలెక్కేసి వుంటుందిలే అని అనుకోడానికి ఆస్కారంవుండును. ఇప్పుడెక్కడని వెదకడం? ఏందారి?"

"ఒరేయ్ సుందరం, ఎంతపనిచేశావురా? అంత అజాగ్రత్త ఎవరికయినాసరే వుండకూడదురా. గోపీగాడిప్పుడువచ్చి ఏదీ, మామామ్మ ఎక్కడుందీ, వున్నపాళంగా మామామ్మని మాకిచ్చెయ్ అంటే నోరెళ్లబెట్టాంల్సిందేగా. ఎవరిదయినా పుస్తకం, కలంలాంటి వస్తువయితే పోతే మళ్ళీ ఇంకోటి కొని ఇవ్వగలడాన్ని, వాడి మామ్మని పోగొట్టితే, మళ్లీ ఆదేలాటిమామ్మని ఎలా ఇవ్వగలవురా?"

"ఒరేయ్ ఏమిట్రానువ్వు అర్థంలేకుండా కోప్పడడం? నేనేమయినా ఆవిడని తప్పిపొమ్మని చెప్పేనంటావా? ఆవిడని నేనజాగ్రత్తగా పారేశానంటావా?"

"నేరేలనాలా? అంతజనంలోఒకకంటకనిపెట్టి వుండాలికానీ"

"ఒక కంటకనిపెట్టి వుండడానికి ఆవిడ ఏమయినా చిన్నపిల్లా? నావెనకాలేవుండి జాగ్రత్తగారావాలికానీ, అటూఇటూ ఎవడు పెత్తనాలకి వెళ్లమన్నాడూ, ఎవడు తప్పిపొమ్మన్నాడు?"

ఇప్పుడు పోలీసుకి రిపోర్టు ఇచ్చిరావడం ఒక్కటే దారి"

"నేను అదేగాచెప్పింది. ఏదోపెద్ద అయిడియా చెప్తోన్న వాడిలాగ పోజుపెడతావేం?"

'ఆవిడ పేరేమిటన్నావ్?'

"మామ్మ"

"ఆవిడ పేరేమిట్రాఅంటే?

"గోపిగాడి మామ్మరా అంటే"

"ఒరేయ్ మటాయ్, ఎవరికైనా గోపిగాడి మామ్మ అని పేరువుంటుందా? ఆవిడ అసలు పేరేమిట్రా? ఆవిడకి ఆవిడ అమ్మానాన్నలు బారసాలనాడు పెట్టిన పేరేమిట్రా?

"ఒరేయ్ నీ తెలివి ఎలావుందిరా? ఆవిడకి డాడాపు డెబ్భయ్ ఏళ్లున్నాయ్. నాకు ఇరవై నాలుగు నడుస్తోంది. ఆవిడ బారసాలకి నేను ఎలావెళ్లివుంటాన్రా? ఆవిడకి బారసాలనాడు ఏంపేరు పెట్టేరో నాకెలాతెలుస్తుందీ?

"ఒరినెర్రినాగన్నా, మనుష్యుల పేర్లు తెలియడానికి, వాళ్లవాళ్ల బారసాలలకి హాజరై వుండనక్కర్లేదురా మనం! ఎవళ్లు ఏపేరుతో పిలవబడితే, వాళ్లపేరు అది అన్నమాట తెలిసిందా ఇప్పుడు చెప్పు ఆవిడ పేరుఏమిటో"

"మామ్మ"

"ఆవిడ అసలు పేరుచెప్పరా. నన్నుచంపకు ఆవిడ అందరిచేత పిలవబడే పేరుచెప్పరా. చెప్పింది అర్థంచేసుకోవేంరా?"

"నేనుచెప్పింది అర్థంచేసుకోవేంరానువ్వు? ఆవిడకి మామ్మ అందరూ పిల్చేపేరు. నేను గోపిగాడి మామ్మ అంటాను"

"ఇంతమట్టి బుర్రఏంరానీది? ఇప్పుడు చూడూ నిన్ను చంటీఅని ఇంట్లో అంతా పిలుస్తారన్నావు. బేషుగ్గావుంది. కానినువ్వుస్కూల్లో హాజరుపట్టీలో సుందరం అనిపడ్డావు. అవునా? ఇప్పుడు నువ్వు చంటీఅని పిలవబడినా, స్కూల్లో సుందరం అనబడ్డావు. సుందరం అన్నది అసలు పేరు. అలాగే ఆవిడ మామ్మఅని పిలవబడినా ఆవిడకి అసలుపేరు ఇంకొకటి వుండివుంటుంది తప్పకుండా. అర్థమయిందా? ఇప్పుడు చెప్పు ఆవిడ అసలుపేరు ఏమిటో"

"ఒరేయ్ కోప్పడకుండా విన్రా బాబూ! ఆవిడ ఏ స్కూల్లో ఏ పేరుతో పిలవబడిందో నాకెలా

తెలుస్తుందిరా ? అసలు ఆవిడ స్కూల్లో చదివే యీడుకి అసలుదేశంలోస్కూళ్లుంటూవున్నాయో లేదో కూడాను. ఆవిడ ఏ వూళ్లో ఏ స్కూల్లో చదివిందో, అక్కడ ఏం పేరుతో హాజరుపట్టీలో పడిందో మనకెలా తెలుస్తుందిరా ? ఎక్కడ దేవుళ్లాడతాం రా ఇప్పుడీ వేళకాని వేళ ఆ వివరాల కోసం ?''

''ఓరి చవటా, ఆవిడ పేరు తెలీదు నీకు. పోనీ ఆవిడ ఎలా వుంటుందో వర్ణించగలవా ?''

''వర్ణించనా ?''

''వూ. క్లుప్తంగా, నో. సొంతమాటల్లో.''

''ఆవిడ లావూకాదు, సన్నంకాదు.''

''వూ.''

''అంత పొడుగూ కాదు. అంత పొట్టీకాదు.''

''వూ.''

''అంత ఎర్రని ఎరుపూ కాదు. అంత తెల్లని తెలుపూ కాదు.''

''వూ.''

''అంత నల్లని నలుపూ కాదు.''

''వూ. అయితే చామనచాయగా వుంటుం దంటావ్ ?''

''చామన చాయ అంటే చామనచాయాకాదు.''

''ఓరేయ్ స్టుపిడ్, ఏమిట్రా నీ వర్ణన ? ఎరుపూకాదు, తెలుపూ కాదు, నలుపూ కాదు, చామనచాయా కాదు, మరి ఏ రంగులో వుంటుం దిరా ?''

''ఏ రంగో నాకు చెప్పడం చేతకావడంలేదురా''

''వూ ? మరేం చేతవునా ? పప్పు నాలుగు సార్లు వేయించుకొని భోజనం చెయ్యగలవ్ ? పోలీసుస్టేషనుకి ఏమని రిపోర్టుచెయ్యడం. తప్పి పోయిన ఆవిడ పేరు తెలీదు. మనిషి ఎలా వుంటుందో తెలీదు. వాళ్లమాత్రం ఎలా వెదికి ఏడుస్తార్రా ?''

''గోపీగాడు వాడి మామ్మ ఫోటో ఒక్కటి అయినా ఇచ్చాడు కాదు. ఆవిడిలా తప్పిపోతుందని తెలిస్తే ముందుగానే గోపీగాడి దగ్గిర్నించి ఆవిడ పేరూ, ఏ స్కూల్లో చదివిందో, ఎంతవరకూ చదివిందో వగైరావివరాలన్నీసంపాదించివుందును అసలిలా అభాసు అవుతుందని తెలిస్తే గోపీగాడితో నీ మామ్మ పూచీ నాకేమాత్రం లేదురా. అని ఖచ్చితంగా చెప్పివుందున్రా. ఇప్పుడేం చెయ్య మంటావురా కైలాసం ?''

''ఏడవమంటా.''

''మహాశయులారా !''

''అదేమిట్రా కైలాసం ?''

''వుండు. విన్రా. మా మునిసిపల్ ఆఫీసు నుంచి లోకల్ బ్రాడ్కాస్టింగు.''

''మహాశయులారా ! ఒక ప్రకటన. ఇవాళ సాయంత్రం కనకదుర్గ వూరేగింపులో ఓ కుర్రవాడు తప్పిపోయినాడు. ఓ కుర్రవాడ రాజమండ్రీనుంచి ఒక పరిచయస్తురాలైన మామ్మగారివెంట కనకదుర్గ వుత్సవం చూడ డానికి వచ్చాడట. ఆ కుర్రవాని ఆనవాళ్ళు ఇవి : పేరు చంటి. స్థూలకాయుడు. చామనచాయ మనిషి. అయిదున్నర అడుగు లెత్తు వుంటాడు. గడ్డంమీద నల్లటి పులి పిరికాయ. అంటకత్తెరజుట్టు. చారలచొక్కా తెల్లటి పంట్లాం తొడుక్కున్నాడు. వయస్సు దాదాపు పాతికేళ్ళు. ఏ మహాశయుడైనా, మహా శయురాలైనా, ఆ కుర్రవానినిచూసినట్టయితే తీసుకొనివచ్చి మునిసిపల్ ఆఫీసుదగ్గిర వప్ప గించమని ప్రార్థితులు. ఆ కుర్రవానితో వచ్చిన మామ్మగారు మునిసిపల్ ఆఫీసుదగ్గి రనే వున్నారు.''

''ఒరేయ్ సుందరం, ఏమిట్రా ఆ పళ్లు పిండుకోడం ? ఏమిటాకోపం ?

''చూశావుట్రా ? గోపీగాడి మామ్మ ఎంత పని చేసిందో ?''

''ఏం చేసిందేమిటి ?''

''ఆవిడ తప్పిపోయినందుకు ఆవిడని నేనెంతో వెదుకుతూ తాపత్రయపడుతోంటే తనెళ్లి మునిసిపల్ ఆఫీసుతో నేను తప్పిపోయానూ అని చెప్పి బ్రాడ్కాస్టు చేయించింది.''

''కొన్నా ఒరే, ఆ ఆనవాళ్లు చెప్తోంటే ఈ కుర్రవాడిని ఎక్కడో చూసినట్టుంది ఏం చెప్మా అని అనుకున్నాను. గోపీ మామ్మ నీ కన్నా ఎక్కువ తెలివి, ఇనీషియేటివ్ చూపించింది. నీ వర్ణన చాలా కరక్టుగా చేసింది కూడా.''

''తగ్గవోయ్. చెప్పొచ్చావ్. ఈ గడ్డంమీది పుట్టుమచ్చ వులిపిరికాయా ?''

''అది అలాగే కన్పడుతుందిలే.''

''నాయీ చక్కటి క్రాఫింగుని అంటకత్తెర జుట్టు అంది చూశావుట్రా ? తనో ముసుగు నెత్తిమీద వుంచుకొని.''

''ఒరేయ్ మరీ అలా ఇదవకురా. అయినా నీ క్రాఫింగు చక్కగానే వర్ణించిందిలే.''

''తగ్గవోయ్, వెనకాల ఆరంగుళాల పిలకేసు కొని నువ్వూ ఎక్కిరిస్తావ్.''

''అనుకో, అనుకో, దేముడి పిలక, నీ కళ్లె పోతాయ్, నాకేం.''

''మామ్మ, మామ్మ, ఉద్ధరించింది.''

''సరే పద వెళ్లి ఆవిడని తెచ్చుకో.''

''ఛస్. నే రాను. నన్ను విశ్వాసంలేకుండా పాతి కేళ్ల పిల్లాడు తప్పిపోయాడూ అంటూ యాగీ చేసింది. నే వెళ్లి ఎందుకు తీసుకొస్తానూ ? అలాంటి మనిషిని ? నువ్వెళ్లి, ఇదిగో యీ మూడు రూపాయలు ఇచ్చేసి తన దారినిపొమ్మను,

''ఒరేయ్, కోపంలో మన్ని మనం మర్చిపో కూడదు.''

''అంటే, నన్నవమానించిన ఆవిడకోసం వెడదామంటావా ? ఏమిటి నీ వుద్దేశం? తప్పి పోయింది కదా, పోనీకదా అని చెప్పి నేను ఖంగారుపడుతోంటే ఆవిడకోసం, పైగా నన్ను అంటకత్తెర క్రాఫింగు అబ్బాయ్ అంటుందా ?''

''ఒరేయ్ వెంటతీసుకొనివచ్చి వూళ్లో అలా వదిలేస్తే ఏమయిపోతుందిరా ? పైగా ఇప్పుడు చూడూ, ఓ రెండ్రోజులపాటు మనం ఇంట్లో చెయ్యికాల్చుకోవాల్సివుంది. నేనూ రేపూ ఎల్లుండీ ఆఫీసు మానడానికి వీల్లేదు. నువ్వే పిల్లలకి చద్దన్నాలూ, మనకి కాఫీలు, దాసీదానికి అంట్లూ, మళ్లీ వంటచెయ్యటం, మా ఆవిడకి వేరే వడ్డనా, అన్నీ చూసుకోవాలి. చేసుకోవాలి.''

''అబ్బ అంత పనుందిట్రా.''

''వూ. మరేమిటనుకున్నావ్. నిన్ను ఇన్సల్టు చేసినందుకు మనంవెళ్లి గోపీగాడి మామ్మనిఇంటికి తీసుకొద్దాం. నీ కసితీరా యీ రెండు రోజులూ చాకిరీ చేయించు. లేదంటావా, యీ చాకిరీఅంతా నీదే పూచీ.''

'''అయితే వెళ్లి తీసుకొద్దామా గోపీమామ్మని'!

''వూ. అవశ్యం.''

''సరే పద.''

''ఏయ్‌రిక్షా, ఇలారా. మునిసిపల్ ఆఫీసు దగ్గరికి ఏం తీసుకుంటావ్? ఇద్దరంఎక్కుతాం?


డాక్టరుగా వుండండి !

ఇంటివద్ద నున్నప్పుడు పోస్టల్ ట్యూషన్ ద్వారా ప్రభుత్వ రిజిస్టర్డు కాలేజినుండి డిప్లమా పొందగలరు ఉచిత ప్రాస్పెక్టస్‌నకు వ్రాయండి

**INDIAN HOMEOPATHIC COLLEGE,**
**(AW) Jullundur City.**

